కథానిక

# "ఆడముండ"

కొడవటిగంటి కుటుంబరావు

(క్రిందటి సంచిక తరువాయి)

లక్షలు గడిస్తానన్నప్పుడు పట్టాభి శుష్క ప్రగల్భాలు పలకలేదు. త్వరలోనే నడుము కట్టి ఆ ప్రయత్నంలోకి దిగాడు. జూన్ నెలాఖరున అతనికొక పాత మిత్రుడు కలిశాడు. ఏం చేస్తున్నావంటే బొంబాయి సినిమాల్లో పనిచేస్తున్నానని చెప్పాడు. పట్టాభికి ఆశ్చర్యం వేసింది. కాని ప్రకాశం అనే పేరుగల యీ మిత్రుడు బొంబాయి సినిమా ప్రపంచంలో నాని, చీకి వచ్చాడన్నది మాటల సందర్భాన నిస్సంశయంగా తెలిసిపోయింది.

"మళ్ళీ పది రోజుల్లో వస్తాను. మద్రాసులో పిక్చరు తీయాలి. నీబోటి స్నేహితులు సహాయ పడాలి" అన్నాడు ప్రకాశం.

సరస్వతిచేత ఈ పిక్చర్లో హీరోయిన్ వేయించవచ్చునన్న భావం పట్టాభి బుర్రలో తళుక్కున మెరిసింది. దిష్టి తగులుతుందని అతనా ఆలోచనను చాలా రహస్యంగా చీకట్లో దాచేశాడు. ఆ తరువాత పది రోజుల పాటు అతను ప్రతిరోజూ లెక్కపెట్టి ఆ పైన ప్రకాశానికీ, పిక్చరుకూ నిశ్శబ్దంగా తిలోదకాలిచ్చేశాడు. అందుచేత జూలై ఆఖరున ప్రకాశం కనిపించి, అన్ని ఏర్పాట్లూ పూర్తి అయాయని చెప్పేసరికి చచ్చిపోయిన పిక్చరు తిరిగి బతికి వచ్చినంత పని అయింది.

పట్టాభి తాను ఉద్యోగం మానుతున్న విషయం ఇంట్లో చెప్పలేదు. ప్రకాశం నెలకు నూరే ఇస్తానన్నాడు. అయితేనేం? పిక్చరు మీది లాభంలో నాలుగోవంతు పట్టాభికి ప్రకాశానికీ చెరిసగం! ఉద్యోగం మానటంలో పెద్ద కీడేమీ కనిపించలేదు పట్టాభికి. ఒకవేళ ఏ కారణంచేతనైనా ఈ పిక్చరుకు లాభం రాకపోయినా తనకు సినిమారంగం కూడా అందుబాటులోకివస్తుంది. ఇప్పుడుమానేసినఉద్యోగం లాటిది మళ్లీ రాకపోదు డొక్కశుద్ధిగలవాడికి.

పట్టాభి చెప్పకపోయినా అతని సినిమా నౌకరీ గురించి ఇంట్లో తెలిసింది. తండ్రి ఖేదించాడు. తాను పైవచ్చే సంవత్సరం రిటైరయి పోయేసరికి తన సుపుత్రుడు సినిమా కంపెనీల వాకిళ్లలో పడిగాపులుపడుతూ ఉంటాడేమోనని ఆయన అనుమానం. నిక్షేపంగా బియ్యే పాసయినవాడికి సినిమా కంపెనీలలో చేరే గతేమిటో ఆయన కర్థం కాలేదు. సినిమా కంపెనీలలో అలగాజనం తప్ప ఇంకెవరూ చేరరని ఆయన గాఢ అపోహ.

అన్న సినిమా కంపెనీలో చేరినందుకు కొద్ది రోజులపాటు సరస్వతి సంతోషించింది. అందులో చాలా డబ్బున్న విషయం ఆమెకు తెలుసు. ఆమె ప్రకాశాన్ని చూసింది. చూసిన అగాయకు ఆమెకు సందేహాలు పట్టుకున్నాయి. ప్రకాశం సినిమాలు తీసే మొహంగా కనిపించలేదు. ప్రకాశమూ పట్టాభీ కూచుని కట్టే గాలిమేడలను ఆమె చూసింది. భ్రమకు గురిఅయి ఉండకపోవటం చేత ఆమెకు గాలిమేడ లేవో గట్టిమేడ లేవో తెలుసు.

ఒక రోజు సాయంకాలం అయిదింటికి ప్రకాశం డొక్కు కారులోవచ్చాడు. పట్టాభిని కేక పెట్టాడు. సరస్వతి పట్టాభిలేడని చెప్పింది. నాన్నగారింకా ఆఫీసునుంచి రాలేదు. అమ్మ దొడ్లో ఉంది.

"నేను బీచికి పోతున్నాను. ఎవరైనా వస్తే రావచ్చు" అని నవ్వాడు ప్రకాశం. సరస్వతి అతన్ని ఒంటరిగానే సాగనంపింది.

పట్టాభి ఇంటికి వచ్చి, "సరూ, సరూ!" అని పిలిచాడు పెద్ద పనివున్న వాడిలాగా.

"ఏమిటి?" అన్నది సరస్వతి.

"ఒకవేళ ప్రకాశం అడిగితే-ఇంకా అడగ లేదు సుమా!-మన పిక్చర్లో వేషం వేయటానికి నీకు అబ్జెక్షన్ ఉండదుగా?"

"తప్పకుండా ఉంటుంది!"

"ఏం?"

"నా కిష్టంలేదు గనుక!"

"సరే పోనీ, ఎవరి ఖర్మ వాళ్లది."

సినిమాలలో వేషంవేసి స్టారు కావటానికి సరస్వతికేమీ అభ్యంతరంలేదు—అవకాశం ఇచ్చే వాడుడుంటే. ఈ అవకాశాన్ని సరస్వతి నిరాకరించటానికి రెండు కారణాలున్నాయి. ఒకటి, పట్టాభి చేతిమీదుగా ఇది రావటం; రెండు, ఇదొక అవకాశమన్న విశ్వాసం సరస్వతికి లేకపోవటం.

ఇంకో లాభం కూడా కలిగింది. ఇకమీదట తాను సినిమాలలో చేరటానికి ప్రయత్నిస్తే పట్టాభి అభ్యంతరం చెప్పటానికి లేదు. ఆ రాత్రి అందరూ నిద్రపోయినాక కూచుని సరస్వతి డైరెక్టరు రెడ్డిగారికి ఒక ఉత్తరం రాసేసింది, తనకు సినిమాలలో నటించే అవకాశం ఇప్పించమని.

ఈ ఉత్తరానికి జవాబు మూడో రోజుకు వచ్చి ఉండవచ్చు. పదమూడో రోజుకు కూడా రాలేదు. సరస్వతి ఒక్క నిట్టూర్పు విడిచింది. కాని ఆశ పూర్తిగా పోలేదు. దివ్యమైన ఆలోచన వచ్చింది. రెడ్డిగారు టెలిఫోన్ మీద అందే టప్పుడు చేతులెందుకు కడిగేసుకోవాలి?...

డైరెక్టరు రెడ్డిగారు తన ప్రొడక్షన్ ఆఫీసు గదిలో కూర్చుని ఉండగా అతని బావమరిది వచ్చాడు.

"ఏంవోయ్, ఎప్పుడు రావటం?" అన్నాడు డైరెక్టరుగారు.

"ఇప్పుడే" అన్నాడు జనార్దనం.

"నేను బయటికి పోతున్నాను, మళ్ళీ పావు గంటలో వస్తా, ఉంటావా?" అన్నాడు డైరెక్టరు.

అతను వెళ్ళిన రెండు నిమిషాలకే టెలిఫోన్ మోగింది.

"హలో?"

అవతల ఆడగొంతు. ఏదో కంగారులో ఉన్నట్లున్నది. ఏం చెప్పేదీ జనార్దనానికి అంతు బట్టలేదు.

"ఈ టెలిఫోన్ చాలా కంగారు పడు తున్నది. మీరు చెప్పే దేమిటో సరిగా విన పడడం లేదు" అన్నాడు జనార్దనం.

"నా ఉత్తరం అందలేదా?" అన్నది సరస్వతి.

తన బావమరిది ఎవతెనో గొంతు కోస్తున్నాడని నిశ్చయించాడు జనార్దనం.

"మీ పేరు?"

"సరస్వతి?"

"ఏ సరస్వతి?"

"పి. సరస్వతి, మీరు నన్నెరగరు లెండి."

"అట్లానా? ఏమని రాశారూ?"

"ఛాన్సు ఇప్పించమని రాశాను."

"ఎంతమందికని ఛాన్సు లిస్తామమ్మా?" తానే డైరెక్టరుగా నటిస్తున్నందుకు జనార్దనం తనలో తాను నవ్వుకున్నాడు, అల్పసంతోషి.

"అట్లా కాదండీ. నేను—కొంచెం అందంగానే ఉంటాను."

"సరే, ఇవాళ సాయంకాలం పార్కుకు వచ్చి బతికిన కాలేజీ గేటు దగ్గిర ఉండండి. నేను సరాసరి నాలుగున్నరకు వచ్చేస్తాను మాట్లాడుకుందాం."

అందమైన అమ్మాయిలంటే జనార్దనానికి విముఖత్వం ఏమీ లేదు. ప్రతిమనిషికీ ఒక రేటు ఉంటుందని అతని నమ్మకం...

నెలాఖరున పట్టాభి జీతం ఇంటికి పట్టుకురాలేదు. డబ్బు పొదుపుగా వాడాలని ప్రకాశం మొదటినుంచీ చూస్తున్నాడు. "మనం డబ్బు సంపాదించేవాళ్ళం గాని ఖర్చుచేసే వాళ్ళం కాదు", అని అతని నినాదం. ప్రకాశం వెంట తిరిగేటప్పుడు కార్లకూ, బస్సులకూ, టిఫినుకూ, సిగిరెట్లకూ ప్రకాశమే ఖర్చుపెడుతున్నాడు. వందరూపాయల ముష్టి జీతంలో ఇంకా చేతికి వచ్చేదేముంది? తండ్రి సంపాదన ఇంటి ఖర్చుకు ఏమూలా చాలటంలేదు. అవసరమైనప్పుడు అయిదూ, పదీ సరస్వతి ఇస్తోంది.

సరస్వతిదగ్గిర డబ్బుంటున్న విషయం తల్లి కొక్కర్తెకే తెలుసు.

"ఎక్కడిదే ఈ డబ్బు? రోజూ సాయంకాలంపూట ఎక్కడికి పోతున్నావే?" అని తల్లి అడిగింది.

సరస్వతి ఏదో చెప్పిందిగాని తల్లికి నమ్మకం కలగలేదు

"నీ వాలకం నాకేమీ బాగాలేదు. కొంచెం పరువుగా బతకనివ్వవు కేం?" అని అడిగింది తల్లి.

"పరువు మగాళ్ళదమ్మా? ఆడముండలకి పరువేమిటి? ఏ పరువైనా డబ్బుతోటే వస్తుంది", అన్నది సరస్వతి.

ఆ ఇల్లాలు కూతుర్ని తిట్టింది, భయపెట్టింది, బతిమాలింది, లోలోపల కుళ్ళింది, కాని భర్తకిమాత్రం చెప్పలేదు. ఇంటిఖర్చుకు కూతురిదగ్గిర తీసుకోవటమూ మానలేదు.

సరస్వతి రహస్యం మొట్టమొదటిగా తెలుసుకున్నవాడు పట్టాభి. జనార్దనం చాలా డబ్బున్నవాడనీ, డైరెక్టరు రెడ్డిగారికి అవసరానికి ఎన్ని లక్షలైనా ఇస్తుంటాడనీ పట్టాభి విన్నాడు.

"కంగ్రాచులేషన్స్, సరూ!" అన్నాడు పట్టాభి.

"దేనికి?" అన్నది సరస్వతి.

"దేనికేమిటి? పెద్దచేపను పట్టినందుకు!"

"నాకు నీమాట అర్థంకాలేదు"

"నా దగ్గిర కొయ్యకు. నాకంతా తెలుసులే!"

ఆ రోజు సాయంకాలం సరస్వతి జనార్దనాన్ని అడిగింది:

"ఇట్టా లాభంలేదు. మా బావగారినడిగి ఏదన్నా కంట్రాక్టు రాయించాలిసిందే. తరవాత వేషం ఉన్నా సరే, లేకపోయినా సరే."

"చూద్దాం" అన్నాడు జనార్దనం. ఇప్పుడున్నస్థితిలో అతను సరస్వతికోసం ఏం చెయ్యటానికైనా సిద్ధంగా ఉన్నాడు.

మర్నాడు సరస్వతి తండ్రితో చెప్పింది "నాకు సినిమా కంట్రాక్టు ఇచ్చారు నాన్నా. నెలకు నాలుగువందలు జీతం."

"ఇంత బతుకూబతికి సినిమాలలో చేరతావుటే?" అన్నాడు తండ్రి.

ఆ రాత్రి ఇంట్లో పెద్ద తగూ అయింది. సరస్వతిని వెనకేసుకునివచ్చి పట్టాభి తండ్రితో హోరాహోరి పోట్లాడాడు. చివరకు ముసలాయన తల ఒగ్గాడు.

సరస్వతి జీవితం మారిపోయింది. ఆమె రెండేసివందల ధూపాయల చీరెలు కొన్నది. వంటినిండా బంగారంనగలు. పదిహేను వేలకారు. ఇంటి అద్దె తానే కడుతున్నది.

జనార్దనంతో సరస్వతికున్న సంబంధం బయటపడ్డరోజున తండ్రి మళ్ళీ అల్లరిపెట్టాడు.

"మీరు నాకు తెలియని విషయాలేవీ చెప్పటంలేదు. నా జీవితం నన్ను బతకనివ్వండి. కావలిస్తే మీరుకూడా నాతోబాటు బతకండి. లేదా మీదారిన మీరుపొండి. నా పోషణలో ఉండి నన్నేమీ అననవసరంలేదు." అన్నది సరస్వతి.

పట్టాభి సరస్వతిని పూర్తిగా సమర్థించాడు.

ఒకనాడు సరస్వతిదగ్గిరికి వచ్చి, "సరూ, ఒక్క సహాయంచెయ్యాలి. మా పిక్చరు ఆగిపోయిందిండి పడింది. ఇంకా రెండులక్షలుంటే పూర్తి అవుతుంది జనార్దనంచేత ఎలాగైనాడబ్బుపెట్టిద్దూ" అని అడిగాడు.

సరస్వతి పట్టాభికేసి విరసంగా చూసి, "నాదేముంది నాయనా? ఆడముండని!" అన్నది. (సమాప్తము)

ప్రొఫెసరు— ప్రపంచంలో ఉన్న వస్తువులన్నిట్లోకీ వజ్రం చాలా కఠినమైంది. గాజుమీదకూడా గుర్తుంచే ప్రభావం వుంది, దానికి.

విద్యార్థి— గాజుమీదేనేమిటండీ! స్త్రీ హృదయంమీద కూడా ప్రభావం వుంటేను!

* * * *

భర్త భార్యతో: మన రామానికి ఏమీ తెలియదు-అన్నీ తెలుసుననే అహంభావం. చూస్తే, వీడు రాజకీయవేత్త అయ్యేటట్లుంది.